# ఎవరు మాట్లాడుతున్నారో ముందు తెలుసుకో!

హలో.... అరుంధతీ! సాయంత్రం ఆరుగంటలకి గార్డెన్ దగ్గరికి రా....''

''....''

''ఏమిటి మాట్లాడవ్? సాయంత్రం తప్పకుండారా. నీ కోసం చూస్తూంటాను ''

''....''

''ఏమిటి మాట్లాడవ్.... నిన్న మా ఆఫీసర్‌గాడు ఏదో పనంటూ కూర్చోపెట్టేశాడు. అందుకని రాలేకపోయాను.... ఈరోజు వాడింకా రాలేదు. అందుకే ఫోన్ చేశాను.... పెట్టేస్తాను.... మా పీనుగ ఏ క్షణాన్నైనా రావచ్చు. ఈ ఆఫీసు ఫోను వాడి సొంతం అనుకుంటాడు. ఎవరయినా ఇక్కణ్ణించి ఫోన్ చేస్తే భరించలేడు.... పెట్టేస్తాను. ఒక్కసారి మాట్లాడు....''

''....''

"మిమ్మల్నేనండి టెలిఫోన్ ఆపరేటర్ గారూ.... మీరు ఫోన్ చేయడానికి ఇబ్బంది వుండదు గాని నాకు చాలా ఇబ్బంది.... ప్లీజ్....కోపాన్ని వదిలిపెట్టి నవ్వుతూ ఒక్క ముక్క మాట్లాడు. మా ఆఫీసరు వెధవ లేడు.... ప్లీజ్....''

''ఎవ్వరా నువ్వు?''

''నువ్వెవరివిరా.... నా అరుంధతికి ఫోన్ చేస్తే ఫోన్‌లో నువ్వెలా వచ్చావ్.... వచ్చినవాడివి నోరు మెదపకుండా నేను మాట్లాడేదంతా ఎలా విన్నావ్....?''

''నీకు మీ ఆఫీసర్ మీద ఎంత ప్రేముందో తెలుసుకుందామని''

''నాకు మా ఆఫీసర్ మీద ప్రేముందో, అరుంధతి మీద ప్రేముందో తెలుసుకోవడానికి నువ్వెవడివిరా....''

"నేనెవర్నా....ఈ ప్రశ్నకు జవాబు చెప్పే ముందు నాకో సందేహం తీర్చు...."

"తొందరగా అడుగు. మళ్ళీ మా ఆఫీసర్‌గాడు...."

''రాడుగాని తొందరపడకు....''

''నీకెలా తెల్సు....?''

''అన్నీ తెల్సు.... మీ ఆఫీసులో అందరూ మీ ఆఫీసర్ని నీ లాగానే తిడతారా?''

''భలే సందేహమొచ్చిందయ్యా నీకు.... మా ఆఫీసులో మా ఆఫీసర్‌గాణ్ణి తిట్టని వెధవుండడు....''

''మరతనిముందు అందరూ అంత అతివినయాలు నటిస్తారేం?''

''ఎవరు చెప్పారు నీకు అతివినయాలు నటిస్తారని? అది పచ్చి అబద్ధం....''

''కాదు- పరమ నిజం!''

''మా ఆఫీసులో విషయాలు నాకన్నా నీకు ఎక్కువ తెల్సా?''

''తెల్సు....''

''మరయితే అందరూ మీ ఆఫీసర్ గురించి ఇలాగే వాగుతారా అని నన్నెందుకు అడిగావ్?''

''నాముందు ఎలా మాట్లాడుతారో నాకు తెల్సుగాని ....నా వెనుక ఎలా బిహేవ్ చేస్తారో నాకు తెలీదుగా....''

''మీరు.... మీరు....''

''మీ ఆఫీసర్ని... బాగా జలుబుగా వుంది- ఆఫీసుకి కొద్దిగా ఆలస్యంగా వస్తానని హెడ్ క్లర్క్ కి మెసేజ్ ఇద్దామని ఫోన్ చేశాను.... నువ్వెత్తావ్ ఫోన్.... అయినా నా ఫోన్ దగ్గర నువ్వెందుకు వున్నావ్?''

''నేను.... నేను....''

''అరుంధతికి ఫోన్ చేయాలని వచ్చివుంటావ్....''

''అవున్సార్.... నేను అరుంధతి ఫోన్ నెంబర్ డయల్ చేశాను.... అందుకే మీరు ఫోన్ మీదకి వస్తారని అనుకోలేదు....''

''నువ్వు డయల్ చేసిన నెంబర్ నీకందకుండా నా నెంబర్ నాకు అందడంవలనే నీ నిజస్వరూపం తెలిసింది.... దొంగతనంగా ఫోన్ చేయగానే సరిపోదయ్యా.... మాట్లాడబోయే ముందు అవతల ఎవరు మాట్లాడుతున్నారో తెల్సుకోవడం మంచిది.''

''అదికాదు సార్.... సారీ సర్....''

''ఆ విషయాలన్నీ నేను ఆఫీసుకి వచ్చిన తర్వాత చెబ్దువుగాని, ముందు ఫోన్ పెట్టేయ్.''